నమస్తే తెలంగాణ

ఎల్లంపల్లిలో ఎఫ్‌టీఎల్‌లోనే

భూముల కబ్జా

- జనవరి నెలలోనే అక్రమాలు గుర్తించిన అధికారులు
- 150 ఎకరాల్లో భూమి ఆక్రమణకు గురైనట్టు నిర్ధారణ
- ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నామమాత్రం చర్యలు
- పట్టించుకోని అధికారులు, యథేచ్ఛగా చెరువుల దందా

పెద్దపల్లి, జూన్ 2 (నమస్తే తెలంగాణ): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు బ్యాక్ వాటర్ ఏరియా ఇరిగేషన్ భూములు ఆక్రమణ వ్యవహారంలో కీలక విషయాలు బయటకు వస్తున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జనవరిలోనే జాయింట్ సర్వే చేపట్టి, 22 చెరువులు ఇరిగేషన్ భూముల్లోనే ఉన్నాయని గుర్తించినట్టు తెలుస్తున్నది. పూర్తి ఎఫ్‌టీఎల్‌లోనే దాదాపుగా 150 ఎకరాలను అక్రమార్కులు కబ్జా చేసినట్టు నిర్ధారించారని సమాచారం. కానీ చెరువులను తొలగించడం తమ పని కాదంటే.. తమ పని కాదని అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వంలోని కొందరు కీలక నేతలు, అధికారపార్టీ నాయకుల అండతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు రెండుశాఖల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి, చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

భూముల కబ్జాపై పోలీసులకు ఫిర్యాదు

ఎల్లంపల్లి ప్రాజెక్టు భూములను కబ్జా చేశారని స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమగ్ర సర్వే చేపట్టి ఎల్లంపల్లి భూములకు హద్దులు పెట్టారు. జాయింట్ రిపోర్టును ఉన్నతాధికారులకు సమర్పించారు. వారి సూచనల మేరకు ఈ ఏడాది జనవరి 7న అంతర్గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఐదు నెలలు గడిచినా కేసులు నమోదు కాలేదు. అక్రమాలను నిగ్గు తేల్చినా వారిపై ఎలాంటి చర్యలూ లేకపోవడంతో ఇందులో పెద్దల పాత్ర ఉందనే విషయం స్పష్టమవుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా నిర్మించిన చెరువుల్లో చేపల కోసం గోదావరిఖని చికెన్ మార్కెట్లోని విషతుల్యమైన కోళ్ల వ్యర్థాలు ప్రతీరోజు క్వింటాళ్ల కొద్దీ వేస్తున్నారని చెప్తున్నారు. ఇదేవిషయంపై పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి అంతర్గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపైనా పోలీసులు కేసు నమోదు చేయలేదు.

ఆక్రమణలు తొలగింపు మా పనికాదు!

రెవెన్యూ భూమి అయినా.. ఇరిగేషన్ భూమి అయినా కబ్జా అయితే వాటిని తొలగించాల్సింది రెవెన్యూ అధికారులేనని కోర్టులు అనేక తీర్పుల్లో చెప్పాయని స్థానిక రైతు సంఘాల నాయకులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేయడంతో ఆ బాధ్యత హైడ్రాకు మళ్లిందని వివరిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూమి కబ్జా చేసి చెరువులను తవ్వితే మాత్రం రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా అధికారులు ఎవరూ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న చేపల చెరువులు

హనుమకొండలో రేషన్ బియ్యం కోసం ఎండలో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

మూడు నెలల బియ్యం.. ఆరుసార్లు తూకం

మొదటిపేజీ తరువాయి...

గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వస్తున్నదని ఆగ్రహంగా చెప్తున్నారు. ఒక్కో నెల బియ్యం కోసం రెండేసి సార్లు వేలిముద్ర (థంబ్) వేయాల్సి వస్తున్నదని, మొత్తం మూడు నెలల బియ్యానికి ఆరుసార్లు థంబ్ పెట్టాల్సి వస్తున్నదని విసుగు చెందుతున్నారు. లైన్‌లో తమవంతు వచ్చాక తక్కువలో తక్కువ అరగంట సమయం తీసుకుంటున్నదని చెప్తున్నారు. సర్వర్ సరిగా పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అన్నీ కలిపి ఒకే స్లిప్పుగా ఇస్తే కొంచెమైనా ఇబ్బందులు తగ్గుతాయని అంటున్నారు.

కొత్త కష్టాలు..

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండటం లబ్ధిదారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. గత నెల వరకు రేషన్ కోసం వెళ్తే.. బయట లైన్‌లో 15 నిమిషాలు నిలబడితే సరిపోయేది. నేరుగా సర్వర్ చెంతకు వచ్చేవారు. అక్కడ సర్వర్ మెషిన్‌లో ఒకసారి వేలిముద్రలు పెట్టి.. వచ్చే కోటా బియ్యాన్ని అదే సమయంలో తూకం చేసి ఇచ్చేసేవారు. కానీ, మూడునెలల బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో నెల కోటా బియ్యానికి ఒక్కోసారి తూకం వేయాల్సి వస్తున్నది. ఒక్కోనెల బియ్యంలోనూ కేంద్రం ఇచ్చే బియ్యానికి ఒకసారి, రాష్ట్ర కోటా బియ్యానికి మరోసారి వేలి ముద్ర వేయిస్తున్నారు. ఇలా మూడునెలలకు కలిపి ఆరుసార్లు వేలిముద్రలు వేస్తున్నారు.

రేషన్ బియ్యం పంపిణీ ఇలా..

- ఇంట్లో ఇద్దరు వ్యక్తులున్న రేషన్‌కార్డుదారుకు నెలకు (ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున) 12 కిలోల బియ్యం వస్తాయి.
- ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.
- ఈ లెక్కన ఇద్దరున్న రేషన్‌కార్డుదారుకు ఒకేసారి 36 కిలోల బియ్యం వస్తున్నాయి.
- ఇంతవరకు బాగానే ఉన్నా.. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉన్నది.
- 12 కిలోల బియ్యంలో కేంద్రం 10 కిలోల ఇస్తుండగా, రాష్ట్రం 2 కిలోల అందిస్తున్నది.
- మూడు నెలలకు కలిపి 36 కిలోల బియ్యంలో కేంద్రం 30 కిలోలు, రాష్ట్రం 6 కిలోలు ఇస్తున్నది.

సూర్యాపేటలో రేషన్‌బియ్యం కోసం క్యూలో సంచులు పెట్టిన లబ్ధిదారులు

ఆయా కోటాల ప్రకారం ఆరుసార్లు బియ్యం తూకం చేస్తున్నారు. ఇది లబ్ధిదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నది. ఒకేసారి మూడునెలల బియ్యం ఇస్తుండటంతో జనం రద్దీ పెరిగింది. రేషన్ దుకాణాల వద్ద బారులు పెరిగాయి. బయటే గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి నెలకొన్నది. పొద్దున్నే లైన్‌లో 40 మంది నిలబడితే 25 మంది కోటా పూర్తయ్యేసరికే సమయం గడిచిపోతున్నది. సాయంత్రం మళ్లీ కొత్తగా మొదటి నుంచి లైన్‌లో వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇది ఎక్కువ సమయాన్ని తీసుకుంటున్నదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

గత నెల వరకు 12 కిలోల బియ్యం తీసుకున్నందుకు రేషన్ దుకాణాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒకే స్లిప్ వచ్చేది. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతినెలా బియ్యానికి కేంద్రం స్లిప్పు ఒకటి, రాష్ట్రం స్లిప్పు మరోటి ఇస్తున్నారు. నెలకు రెండు స్లిప్పుల చొప్పున మూడు నెలల బియ్యానికి కలిపి ఒక్కో లబ్ధిదారుకు 6 స్లిప్పులు ఇస్తున్నారు. అంటే ఒక వ్యక్తి 36 కిలోల బియ్యం తీసుకుంటే కేంద్రానికి సంబంధించిన ప్రతి 10 కిలోలకు ఒక స్లిప్పు చొప్పున మూడు స్లిప్పులు, రాష్ట్ర వాటా ప్రతి 2 కిలోలకు ఒకటి చొప్పున మూడు స్లిప్పులు, ఇలా మొత్తం కలిసి ఒక్కో లబ్ధిదారు ఆరు స్లిప్పులు వచ్చేవరకు వేచి చూడాల్సిందే. ఆరుసార్లు వేలిముద్రలు వేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇలా ఆరు స్లిప్పులు వచ్చేందుకు సర్వర్ దాదాపు 30 నిమిషాల సమయం తీసుకుంటున్నది. ఈ లెక్కన ఒక్కో దుకాణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు 30 మందికి, సాయంత్రం నుంచి రాత్రి వరకు మరో 30 మందికి మాత్రమే బియ్యం అందించే అవకాశం ఉంటున్నది. అంటే రోజుకు దాదాపు 60 మంది. రేషన్ దుకాణంలో 2 వేల కార్డులు ఉన్నాయనుకుంటే.. చివరి వ్యక్తి బియ్యం పొందేందుకు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నది.

లోకం పోకడ



మన చేపల చెరువులో గాలానికి ఏం పడుతున్నాయో చూడు!

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	39.0°c	28.0°c
నల్లగొండ	39.0°c	24.8°c
ఆదిలాబాద్	38.7°c	25.6°c
వరంగల్	38.0°c	26.0°c
రంగారెడ్డి	37.7°c	20.7°c
నిజామాబాద్	36.4°c	26.4°c
మహబూబ్‌నగర్	36.0°c	26.0°c
మెదక్	35.7°c	26.1°c
కరీంనగర్	35.0°c	28.0°c
హైదరాబాద్	32.8°c	24.4°c

మందగమనంలో నైరుతి

- రాష్ట్రంలో మారిన వాతావరణ పరిస్థితులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు రోజుకో రకంగా మారుతున్నాయి. మారిన వాతావరణ పరిస్థితులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో సోమవారం హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. నైరుతి రుతుపవనాలు రోహిణి కార్తెలోనే రావడంతో కొన్నిరోజులు వర్షాలు కురిశాయని, ఆ తర్వాత రాష్ట్రంలో రుతుపవనాల కదలిక మందగించడంతో తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నది. దీంతో కొద్దిగా ఉష్ణోగ్రతలు పెరగటంతోపాటు.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఉదయం మేఘావృతమైన వాతావరణం.. మధ్యాహ్నం సమయంలోఎండ తీవ్రత ఉంటుందని వివరించింది. మంగళవారం కొన్ని జిల్లాల్లో గంటకు 30నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. వారంరోజుల తర్వాత యథావిధిగా మళ్లీ వర్షాలు ఊపందుకుంటాయని పేర్కొన్నది. గడిచిన 24గంటల్లో పలు జిల్లాల్లో వానలు కురవగా, నల్లగొండ జిల్లా గుడిపల్లిలో 9.8 మి.మీ, వికారాబాద్ జిల్లా జహీరాబాద్‌లో 5.8 మి.మీ, నారాయణపేట జిల్లా కోస్గిలో 4.3 మి.మీ, వనపర్తి జిల్లా ఘన్‌పూర్‌లో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది.

జై తెలంగాణ అనని రేవంత్

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభించిన రేవంత్‌రెడ్డి.. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీల గురించి ప్రసంగంలో ప్రస్తావించలేదు. అమరుల కుటుంబాలకు ప్రతీనెల రూ.25వేల ఆర్థికసాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించారు. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేసి, 250 గజాల ఇండ్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఈ రెండు ప్రధాన అంశాలపై రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడంపై ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

రాష్ట్రంలో మహిళలకు క్యూఆర్ కోడ్ కార్డు తెచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించే పథకాన్ని తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మూసీ నదికి పూర్వ వైభవం తీసుకొస్తామని, బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ సరోవర్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. వచ్చే పదేండ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజాప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు.

కవులు, కళాకారులకు నగదు బహుమతి

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన 9 మంది కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.కోటి చొప్పున నగదు బహుమతి అందజేశారు. వీరిలో ఎక్కా యాదగిరావు, అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ, జయరాజు, పాశం యాదగిరి ఉన్నారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్ తరఫున వారి కుటుంబసభ్యులు అందుకున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరఫున ఆయన కుమార్తె పురస్కారాన్ని స్వీకరించారు. బండి యాదగిరి కుటుంబ సభ్యులు అందుబాటులోకి రానందున వారి కోటి రూపాయల పురస్కారం ఇవ్వలేదు.

'జస్టిస్ వినోద్ కుమార్ బదిలీని రద్దు చేయండి'

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానించింది. సోమవారం ఉదయం అత్యవసరంగా సమావేశమై సుప్రీంకోర్టు కొలీజియంకు విజ్ఞప్తి చేసింది. రాష్ట్రపతితోపాటు సుప్రీం సీజే, ప్రధాని, న్యాయశాఖ మంత్రి, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల అనంతరం 'జై తెలంగాణ' అని నినదిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబిత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ నేతలు వినోద్‌కుమార్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కేక్ కట్ చేస్తున్న సిరికొండ, హరీశ్‌రావు (చిత్రంలో సబిత, కేపీ వివేకానంద, పువ్వాడ అజయ్)

బీజేపీతో పొత్తు ప్రశ్నే లేదు

మొదటిపేజీ తరువాయి...

చేశారు. 'తెలంగాణకు బీజేపీ చేసిందేమీలేదు. 8 ఎంపీ సీట్లలో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే బడ్జెట్‌లో సాధించింది గుండు సున్నా' అని నిప్పులు చెరిగారు. నాడు తెలంగాణ కోసం రాజీనామా అడిగితే డ్రామాలు చేసిన కిషన్‌రెడ్డి మాటలను తెలంగాణ ప్రజానీకం నమ్మబోదని పేర్కొన్నారు. ఆనాడు ఒక్క ఓటు రెండు రాష్ట్రాలంటూ ఆర్భాటం చేసిన బీజేపీ చంద్రబాబుకు భయపడి తెలంగాణ ఇవ్వకుండా వెనక్కిపోయిందని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరైన హరీశ్‌రావు అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ వేళ రాష్ట్రావతరణ ఉత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉన్నదని చెప్పారు. తెలంగాణ పదాన్ని నిషేధించిన రోజుల్లో, పదవుల కోసమే తెలంగాణ గురించి మాట్లాడతారనే అపవాదు ఉన్న పరిస్థితుల్లో కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర సాధనను భుజానికెత్తుకున్నారని గుర్తుచేశారు. నెలల తరబడి మేధోమథనం చేసి ఉద్యమానికి అంకురార్పణ చేశారని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్, ఎంపీ, కేంద్ర మంత్రి పదవులను త్యజించిన చరిత్ర ఆయన సొంతమని అన్నారు. రాజకీయ శూన్యతలేని రోజుల్లో రాజకీయ ఉద్దండులు పాలక, ప్రతిపక్షాలుగా ఉన్న పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌కు అంకురార్పణ చేశారని చెప్పారు. 25 ఏండ్ల క్రితం తెలంగాణ.. బొంబాయి, బొగ్గుబాయి, దుబాయి, వలసలు, ఆకలి చావులకు నిలయంగా ఉండేదని గుర్తుచేశారు.

కేసీఆర్‌కు ఉన్నది గుండె బలం

'ఆనాడు ఉసిల్లలెక్క పార్టీలు పుట్టినయ్.. అంతరించినయ్. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి నుంచి 11 మంది ఎంపీలు గెలిచారు. కానీ అప్పటి ఇందిరా సర్కారు తెలంగాణ ఇవ్వకుండా కాలరాసింది' అని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఉద్యమాన్ని ప్రారంభించిననాడు కేసీఆర్ ఆర్థికంగా బలవంతుడు కాదని, గుండె ధైర్యం, రాజీలేని పోరాటమే ఆయన నైజమని పేర్కొన్నారు. అంబేద్కర్ పంథాలో, రాజకీయ మార్గంలోనే తెలంగాణ సాధన సాధ్యమని నమ్మి ఆర్‌ఎస్‌యూ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ దాకా 33 పార్టీలను ఏకం చేశారని కొనియాడారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, సీమాంధ్ర పాలకుల ఎత్తుగడలను చిత్తుచేసి, సోనియాగాంధీతో ప్రకటన చేయించి గమ్యాన్ని ముద్దాడారని చెప్పారు. ఈ రోజు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొనేందుకు కారణం కేసీఆర్ అని స్పష్టం చేశారు. కేసీఆర్ లేకుంటే, గులాబీ జెండా పుట్టకుంటే స్వరాష్ట్రం సిద్ధించేదా అని ప్రశ్నించారు. ధాన్యపు రాశులనే కాదు ఏటా 10 వేల మంది డాక్టర్లను ఉత్పత్తి చేశారని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు నడిపారని, ఇప్పుడు ప్రతిపక్షపాత్రను సమర్థంగా నిర్వహిస్తున్నామని వివరించారు. హైడ్రా, మూసీ బాధితులకు అండగా నిలిచామని, ఇప్పటికీ, ఎప్పటికీ తెలంగాణకు రక్షణ కవచం బీఆర్‌ఎస్ మాత్రమేని ఉద్ఘాటించారు.

రేవంత్‌ది ద్రోహం

ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టి రైఫిల్‌రెడ్డిగా తెలంగాణ చరిత్రలో నీచమైన వ్యక్తిగా రేవంత్‌రెడ్డి నిలిచి పోయారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఆయన ఏనాడు జై తెలంగాణ అని నినదించలేదని, అమరవీరులకు నివాళులర్పించలేదని, చిన్న పదవిని కూడా త్యాగం చేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటులో బీజేపీ పాత్ర కూడా ఏమీలేదని విమర్శించారు. ఉద్యమ సమయంలో రాజీనామా చేయమంటే యెండల లక్ష్మీ నారాయణను ముందుపెట్టి వెన్నుచూపిన ఘనుడు కిషన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అంటే అభివృద్ధి. రేవంత్‌రెడ్డి అంటే అబద్ధాలని ఫైరయ్యారు. ఆడబిడ్డలకు వడ్డీలేని రుణాలిస్తామని, అన్నదాతకు రుణమాఫీ ఎగ్గొట్టి, రైతుబంధు ఎత్తేసి, రైతుబీమాను అటకెక్కించి మోసం చేసిన నీచుడు రేవంత్‌రెడ్డి అని తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. 'ఏడాదిన్నర పాలనలో కేసీఆర్ సర్కారు మంచి పనులపై కమీషన్లు, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకోవడం' తప్ప సాధించిందేమీలేదని నిప్పులు చెరిగారు. 'మహిళలకు 21 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చామని ఆవిర్భావ దినోత్సవాల్లో సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు చెప్పారు. ఇందుకు సంబంధించిన జీవో చూపిస్తే వెంటనే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. దమ్ముంటే ఆయన నా సవాల్‌ను స్వీకరించాలి' అని డిమాండ్ చేశారు. పదే పదే 60 వేల ఉద్యోగాలిచ్చినట్లు అసత్యాలు చెబుతున్నారని, ఇచ్చింది 11 వేలేనని స్పష్టం చేశారు.

ఏడాదిన్నరలో ఏం సాధించారు?

'ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ఉద్ధరించిందేంటి? కనీసం ఒక్క ప్రాజెక్టు కట్టిన్రా? ఎకరానికైనా నీరిచ్చిన్రా? చెక్ డ్యాం నిర్మించిన్రా? ఒక చెరువైనా తవ్విన్రా?' అని హరీశ్ ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 24 గంటల కరెంట్ ఇచ్చి వెలుగులు నింపారన్నాని గుర్తుచేశారు. అనేక ప్రాజెక్టులు కట్టారని, రైతుబంధు ఇచ్చి, రైతుబీమా ఇచ్చి రైతులకు అండగా నిలిచారని స్పష్టం చేశారు. రూ. 40 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని రూ. 16 వేల కోట్లు కూడా చేయలేదని, మిగిలిన డబ్బు ఎక్కడికిపోయిందని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ధాన్యం రాశుల మీద రైతులు గుండెపగిలి చనిపోతుంటే సీఎం రేవంత్ మాత్రం అందాల పోటీల్లో మునిగితేలారని ఎద్దేవా చేశారు. మరణించిన రైతు కుటుంబాలను ఆదుకోవడం దేవుడెరుగు కనీసం పరామర్శించలేదని విమర్శించారు.

ఒలిపింక్స్ నిర్వహిస్తాననడం హాస్యాస్పదం

అందాల పోటీల పేరిట అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పరువు తీసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒలిపింక్స్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉన్నదని హరీశ్ ఎద్దేవా చేశారు. మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడం చేతగాని ముఖ్యమంత్రి నిస్సిగ్గుగా గొప్పలకు పోతున్నారని చురకలంటించారు. మాటలు కట్టిపెట్టి పాలనపై దష్టి పెట్టాలని హితవు పలికారు.

దివానా గాళ్లే దివాలా తీసిందంటున్నరు

తెలంగాణ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, దివాలా తీసిందని, ఢిల్లీకి వెళ్తే చెప్పులు ఎత్తుకుపోయే వారిలా చూస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి దిక్కుమాలిన మాటలు మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. దివానాగాళ్లే తెలంగాణను దివాలా తీసిందంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి తన గోతిని తానే తవ్వుకుంటున్నారని ధ్వజమెత్తారు.

అందాల పోటీలకు పైసలెక్కడివి?

రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని చెప్పున్న సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీలకు పైసలెక్కడి నుంచి తెచ్చారని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'పథకాలకు పైసల్లేవని చెప్పున్న నువ్వు.. నీ భూములకు ఆరులేన్ల రోడ్లకు, బడా కాంట్రాక్టర్లకు రూ. 12,000 కోట్లు ఎట్ల ఇచ్చినవ్. యంగ్ ఇండియా స్కూళ్లకు మొదట రూ. 80 కోట్లని, తర్వాత రూ. 130 కోట్లని, ఇప్పుడు రూ. 200 కోట్లు ఎట్ల వెచ్చిస్తవ్' అని నిలదీశారు. ఈ స్కూళ్ల నిర్మాణం పేరిట ఐదారు వేల కోట్ల స్కాంకు తెరలేపారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక, ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ ఇవ్వకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఇబ్బందిపడుతుంటే ప్రభుత్వం మాత్రం సోకుల కోసం ప్రజాధనాన్ని దుబారా చేస్తున్నదని దుయ్యబట్టారు.

రెడ్‌బుక్‌లో పేర్లు రాసుకుంటాం

సర్కారు కనుసన్నల్లో కొందరు పోలీసు అధికారులు అతిగా వ్యవహరిస్తున్నారని హరీశ్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్లపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. నిన్న గౌతమ్, గతంలో రేవతిని తీవ్ర ఇబ్బందిపెట్టారని విమర్శించారు. సర్పంచ్‌ల నుంచి జడ్పీ చైర్మన్ల దాకా అందరినీ ఏదోరకంగా బెదిరిస్తున్నా రని మండిపడ్డారు. రాత్రికిరాత్రే అరెస్టులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అతిగా వ్యవహరించే పోలీసులు, అధికారులెవరో తమకు తెలుసని, వారి పేర్లను రెడ్‌బుక్‌లో రాసుకుంటామని హెచ్చరించారు.

బనకచర్లతో తెలంగాణకు శాపం

కేంద్రంలోని మోదీ సర్కారు తెలంగాణకు చేసిందేమీలేదని హరీశ్‌రావు విమర్శించారు.11 ఏండ్లలో ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదని, ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని మండిపడ్డారు. ఏపీలోని పోలవరానికి జాతీయ హోదాతోపాటు గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టుకు నిధులిచ్చి తెలంగాణకు ద్రోహం చేస్తున్నదని ఫైర్ అయ్యారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. బనకచర్ల తెలంగాణకు శాపంగా మారనున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంతో మన రాష్ట్రం తెర్లుకావడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతున్నా, అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్నా సీఎం రేవంత్ చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. తన గురువుకు దక్షిణ కింద గోదావరి, కృష్ణా జలాలను ఆంధ్రాకు అప్పజెప్పుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్‌ఎస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా చేసేందుకు, సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు.

అధికార పార్టీ నేతలే అసభ్య ప్రవర్తన

సీఎం రేవంత్ సన్నిహితుడైన ఓ ఎంపీ, కార్పొరేషన్ చైర్మన్, ఓ ఐఏఎస్ ఆఫీసర్ మిస్ ఇంగ్లండ్‌తో అనుచితంగా ప్రవర్తించినట్లు వార్తలు వస్తున్నాయని హరీశ్ తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీసీటీవీ పుటేజీని బయటపెట్టి, బాధ్యులపై చర్యలకు ఉపక్రమించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వినూత్న పథకాలతో తెలంగాణను ప్రపంచపటంలో నిలిపితే, సీఎం రేవంత్ సర్కారు మాత్రం అందాల పోటీల పేరిట తలవంపులు తెచ్చారని ఆరోపించారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేస్తానని ప్రగల్భాలు పలుకుతున్న ఆయన అందాల భామలకు చూపించేందుకు కేసీఆర్ నిర్మించిన సెక్రటేరియట్, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, బుద్ధవనం, యాదాద్రి ఆలయమే దిక్కయ్యాయని ఎద్దేవా చేశారు. 'రేవంత్‌రెడ్డీ.. నువ్వు కాదు నీ తాత జేజెమ్మ వచ్చినా కేసీఆర్ ఆనవాళ్లను చెరపలేరు. చరిత్రలో నిలిచి పోయే ఘట్టాలు చెరిపివేస్తే చెరిగిపోవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని చురకలంటించారు. అంబేద్కర్ పేరుతో కట్టినందునే సచివాలయానికి వెళ్లడం లేదా? అని ప్రశ్నించారు.

అట్టహాసంగా ఆవిర్భావ సంబురాలు

తెలంగాణ భవన్‌లో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర అవతరణోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గులాబీ శ్రేణులు 'జై తెలంగాణ..జయహో తెలంగాణ.. జై కేసీఆర్' నినాదాలతో హోరెత్తించారు. కళాకారుడు సందీప్ ఆలపించిన జయహో తెలంగాణ గీతం ఆకట్టుకున్నది. కళాకారులు తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శనలు ఇచ్చారు.